# కథాకేళి

వాడపల్లి విజయభాస్కర రామారావు

గది తలుపులు బార్లా తెరచి వున్నాయి. రెపరెప లాడుతున్న కర్టెన్ లోంచి ఆశలు రేకెత్తించే నీడలు-

తెరచిన తలుపులు తట్టేటంత మూర్ఖుడినా? బ్రతకనేర్చిన వాడినని బజారున పడ్డాను

ఆమె పిలుపుని ఆసరా చేసుకొని తెర తొలగించి లోపల జొరబడ్డాను. లోపలి వెచ్చదనం నన్ను ఉన్మాదుణ్ణి చేసింది, ఆనం దపుటంచులు చూపింది.

—మర చెంబునీళ్ళతో, మరోచేత్తో తాంబూలంతో సాక్షా త్కరించింది శ్రీమతి. 'ఇక నీ అల్లిక అంతేలే' – నేపథ్యగానం విన వచ్చింది.

"ఏమండీ" మళ్ళీ ప్రారంభించారూ కథాకేళీ?"

ఆర్నెల్లేం ఖర్మ, పదహారేళ్ళయి సాహచర్యం చేస్తోందేమో ఆమెకీ పట్టేసింది నా శ్లేషాభిమానం. అయినా నాలోని నర్తకుని భంగిమల నవగాహన చేసేసుకుందేమోనని నా కెప్పుడూ అను మానమే.

భుజంమీంచే చదివేసి ఉంటుంది నాలుగు వాక్యాలూ. మరచెంబు టేబిలు మీద పెడుతూనే వ్యాఖ్యానం_"అబ్బ! మీ టేస్ట్ డిస్గస్టింగ్"

_కాన్వెంటులో చదువుకొని దరిమిలా మిషనరీల దగ్గర తర్ఫీదయిన శ్రీమతి విశేషణాల ఏర్పు కూర్పుల్లో భావశబలత పటిష్టంగా బహిర్గతం చేయగలదు.

"యూ సిల్లీ!"

_అలా అనిపించుకోవటం మా శ్రీమతికి ఎంత 'ఇద'ంటే మకరంద బిందు తుందిలమైన సురభిన పుష్ప మాలికతో చెక్కిలిపై స్పృశించినట్టు రియాక్ట్ అవుతుంది. మూడ్ ఎలానూ పోయింది కదా అని వేశానా సమాస్త్రం మరోసారి.

"యూ సిల్లీ_బార్లా తెరచిన తలుపు ల్లోని తలపులు అసలు నీ ఊహ కందు తాయా?"

"అంతలోతుగా ఉంటాయా, ఆ తలపులు? చవకబారుగా, నాసియే టింగ్ గా వుండవూ?"

డిస్గస్టింగ్, నాసియేటింగ్_నన్నిష వకాబ్యులరీ_తలపులుబోడులుకానివిచిత్ర వ్యక్తులకు సౌకుమార్యం వలకబోసే పద జాలం_ఓర్పు పోగొట్టుకొని భావప్రకటన

చెయ్యలేని అసమర్థుణ్ణి. హి హేజ్ ఇన్ఫినిట్ పేషన్స్. అతని ఓర్పుకి అవధులు లేవు. సాధారణంగా నేను పొందే అలిఖిత యోగ్యతా పత్రం. చిరునవ్వు పులుముకున్నాను చంటిపిల్లాడు పసుపు పులుముకున్నట్టు.

"చవకబారు లెక్కడో చక్కనీ! ఐదువందల ఒకటి బారు రేషనుకార్డుల మీద ఇస్తూంటే?"

అప్పటికప్పుడే వచ్చిన శ్లేషతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

"నలుగురి పిల్లల తండ్రి అయ్యారు. ఇంకా ఏమిటండీ, ఈ ఇమేజరీ?"

"ప్రెసైజ్ లీ. అందుకే ఈ ఇమేజరీ! లేకపోతే తెల్ల వాయిల్ చీర చాలదూ. చెయ్యంత వెడల్పు జరీ కావాలా పాన్పు సేవకి?"

వెనక్కి ఒత్తిగిలిపోయింది శ్రీమతి, కాగల కార్యానికి అవరోధం_ట్యూబ్ లైటు ఆరిపోయింది. చీకటిలోంచి వెన్నెలను "ఊ" చెయ్యడానికి ప్రయత్నం. అలసటలో సుషుప్తి.

"ఆఫీసర్లకు వర్కింగ్ డే, హాలిడే ఒకటే! ఏమిట్రోయ్ ఇంత హడావడిగా వచ్చావ్?"

"కొంచెం సావధానంగా విను" ఇతివృత్తం చెప్పాను.

"అసలు అయిడియా ఎలా వుందంటావు? కథ క్లైమ్‌స్కీమ్‌లో చిన్న కుదుపు. స్వగతం కూడ క్షీరనీరన్యాయంగా ."

"నీస్వగత మెవడికాక్కా వాలోయ్?"

"స్వగతమే కాదు. నా గతంకూడ వుంది. అది తీసేస్తే ఇతివృత్తంలో వృత్తమే మిగులుతుంది. ఇంతిని ఎలానూ పోగొట్టుకున్నాను. వేలాది కథలు చదివే పాఠకులు ఓ చిన్ని ప్రయోగాన్ని మన్నించరూ?"

"ఆ మన్నిస్తారు"

"అంటే!" శ్లేష నాకు బోధ పడలేదు, మూర్తి వివరించేవరకు.

"మన్ను ఇస్తారు"

నాకు కోపం వచ్చింది. నేకొట్టిన కర్రే నా నెత్తిన తిరగేస్తున్నాడని.

"ఆఁ పాఠకులు మన్నిస్తేనేం, పత్రిక వాళ్ళ మనీ సంగతేమిటి?"

నేను జీవితంలో సాధించలేని వాటిల్లో ఒకటి _ డబ్బుకోసం కథలు వ్రాస్తున్నానని మూర్తిగాడిని నమ్మించడం

మిత్రుని ఉపదేశం నాకంత సమ్మతంగాలేదు. వాడి కటువుతనం నాలోని మొండితనాన్ని రెచ్చగొట్టింది. వాడు చెప్పడమూ, నేను వినడమూనా!

ఈ తర్కమ్, ఈ స్వార్థమ్ నన్ను ఇంత మెటీరియల్ గా బాగు చేసింది. మెటీరియల్ గా నేనెంత పైకొచ్చినా నా మెటిల్ మాత్రం అలాగే ఉండిపోయింది. అందుకే ఈ తపన, ఆరాటం. ఈ నా స్వగతానికి వేడి నిట్టూర్పు విశుస్తే అదే పదివేలు.

* * *

సనత్ నగర్ నుండి కోఠీ దగ్గర వున్న హెడ్ ఆఫీసుకు వచ్చేసరికి పన్నెండయింది. చాలా కోపంగా విసుగ్గా వున్నవాడిలా తలుపు తెరుచుకొని లోపలికెళ్ళి బెల్ కొట్టాను. చల్లని

కూలర్‌లో నీళ్ళు తాగి సేద తేరి ఓ పావుగంట భుక్తాయాసం తీర్చుకొని మళ్ళా బ్రేక్ కొట్టాను. “స్టెనో కో బులావ్.”

చీర కుచ్చెళ్లు సవరించుకుంటూ వచ్చింది గంజిపెట్టిన నేత చీర రెప రెపలే కానీ, గాజుల గలగలలు లేవు. లాక్టో కేలమిన్ బేస్ చెదిరి పైపై మేకప్ కదిలిపోయింది. కుసుమ సౌరభం లేని తలకొప్పు, డిస్గస్టింగ్ — పదహారేళ్ళ సాహచర్యం వారు వీరవక ఏం జరుగుతుంది!

“ప్లీజ్ టేక్ డౌన్. డియర్ మిస్టర్ పాండురంగారావ్ .. పూర్తి పేరు రాస్తే చదువుకోంటున్నవాడు కొద్దిగా ప్లీజ్ అవుతాడు. దిస్ హేస్ రిఫరెన్స్ టుయువర్ లెటర్ .. ఈ ఉత్తరానికి నేను మార్జిన్‌లో సూచించిన విధంగా సమాధానాలు కూర్పు చేసి టైపు చేసి సాయంకాలం నాలుగింటికి ఇవ్వండి ప్లీజ్ నన్ను మాత్రం డిస్టర్బ్ చెయ్యకండి. నేనిక్కడ లేననుకోండి”


తలెత్తి వింతగా చూడకుండానే లెటర్స్ బంచ్ పట్టుకొని వెళ్ళిపోయింది. ఏకాంతపు తెరల మధ్య నిర్భయంగా నిస్సంకోచంగా కాగితాల బొత్తి తీసి ఓ కాగితం నునుపు చేశాను

* * *

“పై ఊరు పైచోటు ఎలా వుంటావో! నాన్నగారికంతా హడావిడి, చదువు పూర్తయి రెండు నెలలు కాలేదు, ఇప్పుడేం మునిగిందనీ, ఈ ఉద్యోగానికి?” ఫుల్‌స్టాప్ లేకుండా కామాలతోనే సాధిస్తోంది అమ్మ నాన్నగారిని. నాన్నగారిని సాధించడమంటే అమ్మకెందుకో అంత కుతూహలం? వెయ్యేళ్ళ సాహచర్యం నిత్య నూతన రకంగా వుండాలంటే ఈ సాధింపులు, ఎత్తిపొడుపులూ, ఇవేనేమో చిట్కాలు.

“నీ చేతి తిండి పుట్టిన దగ్గరనుండి తింటున్నాడు. ఇంకెన్నాళ్ళు తింటాడు? రెక్కలొచ్చిన వాడు ఎప్పటికైనా గూడు వదలాల్సిందే” ఘాటుగా ప్రారంభించినా మార్దవంగా ముగించారు సమాధానం

అమ్మా, నాన్నగారు స్టేషన్‌కి వచ్చారనేమో రైలు మూడు గంటలు లేటు. ఫోన్ చేస్తే ఘంటలేటన్న పెద్ద మనిషి స్టేషన్‌కొస్తే “ఇండెఫినెట్లీలేట్ సారీ!” చిక్కం వెనకాల ముఖానికి



ఫోన్ అడ్డు పెట్టేసుకున్నాడు. వెనుకకు వెళ్ళడం అమంగళం_వద్దంది అమ్మ. నేను ఆరోగ్యం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అమ్మ చెబుతూవుంటే ఉద్యోగంలో మెలకువలు చెబుతున్నారు నాన్నగారు.

"ట్రైనింగ్ మూడు నెలలూ వాడింట్లో వుండమని రాశాడు. అక్కడే వుండు ఆ తరువాత దగ్గరగా వెయ్యమని రాస్తాను."

నాకు ఇంటికి దూరంగా వుండటమంటే భయమనో, లేక వుండలేనంత అర్భకుడి ననో వాళ్ళ అనుమానం నన్ను బొత్తిగా పుత్రనాగమ్మలా చూసేవారు _ ఆనర్స్ పూర్తిచేసినా.

__"ఏం ఓయ్ రామూ! టెలిగ్రాం అందదని భయమేమో మీ నాన్న రాత్రి ట్రంకాల్ చేశాడు నన్ను స్టేషన్కు రమ్మని" కార్లో చెప్పారు వేణుమాధవ రావుగారు. నిద్ర మేల్కొని వీధుల్లోంచి సాగిపోయిన కారు వే. మా. గారింటి దగ్గర ఆగింది.

ఆదరాబాదరా లోపలికి కెళ్ళి "ఏమే ఒచ్చేశాడే రామూ అదేనే పిచ్చి మొద్దా మా సూరిగాడి కొడుకు"అన్నారు వే మా గారు "స్నానం చేస్తావోయ్?" నా వేపు తిరిగి అడిగారు.

చేత్తో కాఫీకప్పు పట్టుకొచ్చినావిడ, పెద్ద బొట్టు పెట్టుకొని కన్నాంబలా ఉంది.

"పిచ్చి మొద్దు". ఈవిడ పిచ్చి మొద్దా? దంపతుల మధ్య రాగబంధం, వాడిపోని పూలచెండు. అందులోని దారపుపోగులు అమ్మ సాధింపులు. నాన్నగారి వెక్కిరింతలూ_వే మా గారి తీపితిట్లు. 'కన్నాంబ' గారి_ఆమె పేరు నాటికీ నేటికీ నాకు తెలియదు _ కసురుకోడాలు.

"అబ్బ ఉండండి, ఆ అబ్బాయి కాస్త ప్రయాణాయాసం తీర్చుకో నివ్వండి. ఏం బాబూ అమ్మా, నాన్న గారు అంతా కులాసా? మీ అమ్మని చూసి ఎన్నాళ్ళయిందో. పద్మని క్షణం ఒదిలేది కాదు. పద్దూ తెల్లారి లేస్తే మీ ఇంట్లోనే వుండేది" ఆ తరువాత తెలిసింది పద్దూ అంటే పద్మ అని. మా నాన్నగారు, వే మా గారు బెజవాడలో కలిసి పనిచేసే వారట చిన్ననాటి స్నేహితులు చాలా కాలానికి కలిశారేమో ఒకే కుటుంబంలా వుండేవారట అమ్మ చెబుతూ వుంటుంది. నాది మరీ నిశితమైన జ్ఞాపక శక్తి కాదేమో ఆ 'పద్దూ' ఎవరో నాకు జ్ఞాపకం వచ్చేలోగానే హాలుకి ఆనుకున్న గది కర్టెన్ వయ్యారంగా చేతిలో తొలగిస్తూ నైటు గౌనులో బయటికి వచ్చి నుంచొన్న పద్దని మి దే ళ్ళ అమ్మాయ్ పద్దూ అని వెంటనే తెలిసిపోయింది కొత్త మనిషి. అంతలోనే భీత హరిణేక్షిణలా రివ్వున ఆనుపచ్చ గుబుర్ల కర్టెన్ వెనకాలకు చెంగున గెంతేసింది.

వెళ్ళిన రోజే ప్రారంభమైంది నా ట్రైనింగ్. తొమ్మిదికి వే మా గారితో టేబిల్ మీల్ చేసి ఆయనతోపాటు కారెక్కి వెళ్లేవాడిని లంచిటైముకి ఆయనతోనే కాస్త టిఫెన్, కాఫీ .. మూడున్నరకు వీలైతే ఓ కప్పు చాయ్ ఐదున్నరకి ఆయనతోపాటు ఇంటికిరాక. కంటికి రెప్పలా కాపాడారు నన్ను వేమా దంపతులు. 'కన్నాంబ' గారు నా

మీద అవ్యాజ్యానురాగం చూపేవారు.

నేను వారింట్లో దిగిన రెండు రోజులకు తెలిసింది పద్మ ఏదో క్రైస్తవ కళాశాలలో బి. ఏ. చదువుతోందని. సాహిత్యం స్పెషల్ గురించి మాత్రం తరువాత తెలిసింది యాధృచ్ఛికంగా. నేను ఆంగ్ల సారస్వతాన్ని అధ్యయనం చేసినట్టు వేమాగారికి తెలుసు. పద్మకి తెలుసునని నాకు తెలియదు. అనుకున్న దానికంటె వేగంగానే నన్ను చూసి చెంగు వెయ్యడం మానేసి భోజన ఫలహారాలు కలసి చెయ్యడం మొదలుకొని నేను చదివే పుస్తకం సోఫా వెనకాల నిలబడి చదివేంత చనువేర్పడింది పద్మకి. 'కన్నాంబ'గారు అలాంటి సీన్లు చూసి చటుక్కున వెనక్కి వెళ్ళిపోయే వారు. ఆమె ముఖాన్ని ప్రసన్నంగా ఉన్నట్టు ఊహించేవాడిని.అలా వెనకకు తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు


ఓరోజు ఆదివారం అనుకుంటాను

_"ఏమండీ, ప్లాటుకీ స్టోరీకీ తేడా ఏమిటి?" తలెత్తి మీదకు చూశాను. ఆమె రాకను గమనించిన నాకు ఆమె గొంతు కొంత తత్తరపాటు కలుగ చేసింది. నేను కథలు రాస్తానని ఆమె కెలా తెలిసిపోయిందీ అని ఆశ్చర్యపోయాను. అప్పటికి నా కథ ఒక్కటీ అచ్చు కాలేదు_ఆ రోజే తెలిసింది ఆమె లిటరేచర్ స్పెషల్_సాహిత్య ప్రత్యేకి అని.

"షార్టు క్వొశ్చనా, ఎస్సేనా?" నిద్రలో కూడమార్కులను బట్టి సమాధానం కూడ_అందుకే నన్ను బ్రతక నేర్చిన వాడంది సారిదునియా.

"సూక్ష్మంగానే సెలవియ్యండి."

_టేబిల్ మీద కూచుంది. నా కథ చూసేస్తుందేమో అని భయమేసింది. 'జస్టె మినిట్' అంటూ తలుపు దగ్గర కెళ్ళాను. ఆమె టేబిల్ దిగి నా వంక రావడం చూసి గభాలున కాగితాలు



సొరుగులో పెట్టేశాను. కుర్చీమీద కూర్చొని కాస్త సేదదీరి ప్రారంభించాను లెక్చరెట్టి.

"రాజాగారు చనిపోయారు. రాణీగారు చనిపోయారు. ఇది ప్లాటు, అదే ఇతివృత్త మంటారు తెలుగులో. రాజుగారు చచ్చిపోయారు కాబట్టి రాణీగారు చచ్చిపోయారు. ఇది కథ. ఇతివృత్తంలో కనబడని కారణ కార్య సంబంధం కథా కథనంలో కనబడుతుంది. పార్టు ఆన్సర్ కి ఇది చాలు. చూడు పద్మినీ! ఇదంతా నా స్వంతమనుకు నేవు! లిటరేచర్ స్పెషల్ వి స్వంతంగా ఏదీ వ్రాయకూడదు. కొటేషన్లకు ఇవతల ఉపయోగించే మాటలు తప్ప. కొన్ని కొన్ని సందర్భాల్లో మాత్రం ప్రఖ్యాత విమర్శకులలోంచి వాక్యాలు కొటేషన్లు లేకుండా స్వంతం చేసుకొని రాసేయడం మరొక మెలకువ కొండొకచో జాగ్రత్తకూడా అవసరం"

పదమూడు ఆదివారాలు. మధ్యలో మూడు శలవు దినాలు వెరశి పదహారూ పండుగ దినాల్లా గడచిపోయాయి. ట్రైనింగ్ అయిపోగానే మొదటి పోస్టింగ్ విశాఖపట్నం వెళ్ళవోయ్ అన్నారు వేమాగారు. చదువుకొన్న ఊరు, సరేనన్నాను

* * *

"క్రొత్త ప్రొబేషనరీ ఆఫీసర్ కు ఇల్లు కావాలట" గదిలో వున్న నాకు బయట మాటలు వినబడ్డాయి.

"బ్రహ్మచారికి ఇల్లెందుకు లేవోయ్?" ఎవరో సందేహాన్ని వెలిబుచ్చారు.

"ఏం, ఇల్లు కావలసిన బ్రహ్మచారులుండకూడదా?" ఒక కిన్నెర కంఠం. బయిటికివచ్చి చూడాలనుకున్నాను. కా ఆఫీసర్లు బయటపడకూడదు. కూల్ రిజర్వ్, మెంటైన్ కూల్ రిజర్వ్ మై బోయ్" సర్కస్ లో ట్రైనింగ్ ఇచ్చిన గురువుగారు మా కిచ్చిన సలహా. మా చుట్టూ మేం కట్టుకున్న కంచుగోడ. రెండు రోజులైతే కాని కిన్నెరవీణ లాలిత్యం కంటపడలేదు_ ఆఫీసర్స్ మీ గదులకు తిన్నగా తలెత్తకుండా వెళ్ళిపోండి ఆఫీసులో సిగరెట్లు కాల్చే గుమస్తా పుంగవులుంటారనేమో. మేం గీసుకున్న ఇదో గీత!

"ఆమె ఆఫీసుకు రాగానే నన్ను చూడమనండి వెరీ ఇంపార్టెంట్" గదిలోంచి వస్తూ సీటులో వున్న ఒకే ఒక గుమస్తాతో చెప్పాను. నిన్న ఆరున్నరై పోయింది. తలనొప్పి, నేరుగా మా రూమ్ కి వెళ్ళి పడుకున్నాను. తెలివి వచ్చేసరికి పదిన్నరై పోయింది. గ్లాసుడు నీళ్లు తాగి పడుకున్నాను. కటికవుపవాసం, అలవాటులేని పని పొద్దున్నే హోటల్ కి పంపి మొదటిసారిగా పూర్తి కారియర్ ఖాళీ చేసేశాను.

"ప్లీజ్ సిట్ డౌన్ మిస్ కాంచన మాలా" ఫైళ్ళలోంచి తల ఎత్తకుండ ఆర్డర్ చేసి మళ్ళీ స్వగతంలో మునిగిపోయాను. ఇది వేమాగారిచ్చిన శిక్షణలో మరో భాగం. నీక్రింద పనిచేస్తున్న వాళ్ళ వైపు సూటిగా చూడకూ అని. మెంటల్ గా ఎస్టిమేట్ చేస్తున్నాను. మల్లెల సౌరభం ప్లస్ కూటికురా స్మెల్. సన్నగా కంకణ నిక్వాణం, కుంకుమ సౌరభం అతి మైల్డ్ గా, పేరు బాగుంది. ఇక చెప్పదలచుకున్నది చెప్పాలి. బీ

"చూడండి మిస్ కాంచనా" కుర్చీలో చేరబడుతూనే ఆమెవైపు చూడకుండానే ఆమె నావైపు చూసేటట్లు చేశాను. "నాకూ ఒక జీవితం ఉంది. ప్లీజ్. నా జీవితం నన్ను జీవించనివ్వండి నిన్న మీరు వేసిన స్టేట్‌మెంటులో రెండు ఎంట్రీలు తప్పు వేశారు మీరేమో ఐదింటికే ఇంటికి వెళ్ళి ఉంటారు. ఆ తప్పులు కనిపెట్టటానికి నాకు గంటన్నర పట్టింది. విపరీతమైన తలనొప్పితో ఇంటికి చేరాను. అభోజనం ఉన్నాను "—'గివ్ ఎ పెర్సనల్ టచ్' మరో ఆణిముత్యం. చీవాట్లు పెడుతున్నా చివరన ఓ వ్యక్తిగతమైన స్ట్రోక్.

"క్షమించండి నేను చెయ్యాలని చెయ్యలేదు పొరపాటు"

కంఠంలో ఒణుకు, వీణలో అపశృతి భరించలేకపోయాను.

"మీరు భలేవారే, పొరపాటు చెయ్యాలనుకొని చేస్తారా?"

కొంచెం ధైర్యం చిక్కబట్టుకుందేమో ఇంగ్లీషులోకి తెప్పరిల్లింది. "అయాం రియల్లీ సారీ, ఎక్స్‌క్యూజ్ మీ."

నేను ఊహించని పరిస్థితి ఆమె కళ్ళలో నీళ్ళు మొదటిసారిగా తలెత్తి చూశాను. తెల్లని మొఖం ఎఱ్ఱగా కంది పోయింది. ఆఫీసర్ వెనక్కి వెళ్ళిపోయాడు. ధీరలలితుడైన కావ్య నాయకుడు ముందుకు వచ్చాడు

"దానికి కంట తడి పెడతారా, డోన్ట్ బి సిల్లీ."

బ్రెస్ట్ పోకెట్‌లోని రుమాలు తీసి ఇచ్చాను.

తెలుగుతేమ, నల్లని వాలుజడ, తలలో మల్లెల సౌరభం తెర వెనుకగా కనుమరుగైంది.

మరుసటిరోజు.

"మీ కర్చీఫ్."

అదే సౌరభం. మళ్ళీ జడే కనపడింది. కర్చీఫ్‌లో ఏదో చిన్న పెరఫ్యూమ్. పేంటు జేబులో పెట్టుకున్నాను.

మరుసటిరోజు సాయంకాలం నేను నా రూమ్‌లో నుండి ఇవతల కొచ్చేసరికి కాంచనమాల ఇంకా సీటులోనే ఉంది.

"ఇంకా మీ పని పూర్తికాలేదా?"

లేచి నిలబడింది నాకు జాలివేసింది.

"మీ పని పూర్తిచేసుకోండి నేను లోపల వెయిట్ చేస్తూంటాను. కలిసి పోదాం."

వెనుతిరిగి పోయాను. స్వీట్ రిట్రీట్. కుర్చీలో రిలాక్సై సిగరెట్ ముట్టించాను పూర్తయిన సిగరెట్ ఆష్ట్రేలో పడేస్తూంటే తలుపు తట్టింది

తలుపుల్లోంచి బయటపడ్డాను. కోటు కుర్చీకి తగిలించి ఇవతలకి ఒచ్చాను

"మీరు చాలా మంచివారండీ"

కోటు లేదు కదూ అనుకున్నాను. సముద్రంమీద కెరటాల తుంపరలు చల్లగా హాయిగా మీద పడుతున్నాయి.

"అలాగా, నాకు ఓ సందేహం?"

"చెప్పండి."

కన్నులు పెద్దవి చేసుకుని చూస్తోంది. తను చెప్పగలిగిన సందేహమేమిటా అన్నట్టు.

"బ్రహ్మచారికి ఇల్లు ఎందుకుండాలి."

తెల్లబోయింది.

## శత్రువును నాశనం చెయ్యడం!

**తన శత్రువులయెడ అతి ఉదారతను ప్రదర్శిస్తాడన్న విమర్శ అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహాంలింకన్‌పై వుండేది. శత్రువును సర్వనాశనం చెయ్యాలని సలహా ఇచ్చేవారు శ్రేయోభిలాషులు. దీనికి లింకన్ "శత్రువులను మిత్రులుగా చేసుకోవడం ద్వారా నేను నా 'శత్రువు'లను సర్వనాశనం చేస్తూనే ఉన్నానుకదా" అనే వారట.**

"సారీ మీరు వింటున్నారనుకోలేదు."

"ఇంతకీ మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు."

ముకుళితమందారం తలను వాల్చేసింది.

"మీ రెక్కడ ఉంటున్నారు?"

"చెంగల్రావుపేట."

"నేను అఫిషియల్ కాలనీలో వుంటున్నాను. బ్రహ్మచారికి ఇల్లు కావాలన్నారుగా. మా ఇంటికి రండి."

బెరుకులేకుండా వచ్చింది. నేనూ వెళ్ళాను వాళ్ళ యింటికి. ఇద్దరం ఆదివారాలు కలుసుకునే వాళ్ళం. ఓ వారం చెప్పింది రాబోయే ఆదివారం తన పుట్టిన రోజని, సాయంకాలం వాళ్ళింటికి రమ్మని. వాళ్ళన్నయ్య దగ్గరకి వెళ్ళారట వాళ్ళ అమ్మ నాన్న.

—పుట్టినరోజు ముద్దు ముచ్చట తీర్చవలసింది నేనే అని అర్థంచేసుకున్నాను. మైసూరు జార్జెట్ లేత నీలిరంగు చీర, బ్లౌజు పీసు తీసుకున్నాను. ఆదివారం సాయంకాలంకోసం ఎందుకింత నిరీక్షణ? మరీ ఎడోలిసెంట్‌లాగ అంగలారుస్తున్నానేమో అనిపించింది.

పిండి ఆరబోసినట్టు వెన్నెల.

గది తలుపులు బార్లా తెరచివున్నాయి. రెపరెపలాడుతున్న కర్టెన్‌లోంచిట్యూబ్‌లైట్ అందమైన నీడలు.

—తెరచినతలుపులుతటపటాయిస్తున్నా ఆమె పిలుపును ఆసరా చేసుకొని తెర తొలగించి లోపల జొరబడ్డాను. లోపలి వెచ్చదనం నన్ను ఉన్మాదుణ్ణి చేసింది. ఆనందపుటంచులు చూపింది.

—కలలో నడుస్తున్నట్టుగా రాత్రి పదయ్యాక నా రూమ్‌కి చేరుకున్నాను. నాఅతి కొత్త జ్ఞాపకాలు ..నలిగిపోయిన జార్జెట్ చీర. వాడిపోయి క్రింద పడిపోయిన మల్లెచెండు

—నా మొత్తం జీవితంలో అతితీపి మూడు నెలలు గడచిపోయాయి. పతాక సన్నివేశం మిత్రుడు మూర్తి కంట పడింది. వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

"ఏమిట్రా అది? ఒడిలోతలా? కర్టెన్ వేసుకొంటే సరి అనుకున్నావా? తలుపులు వేసుకోవాలన్న జ్ఞానంలేదూ?"

—ఆమె ఒడిలో నా తల చూశాడో నా ఒడిలో ఆమె తల చూశాడో అడిగే ధైర్యం లేకపోయింది.

గిట్టనివాళ్ళేదో అనుకుంటున్నారంది కాంచనమాల. నేను చెయ్యగలిగిందేమీ లేదనుకున్న మూర్ఖుడిని. హెడ్ ఆఫీసు నుండి వచ్చింది నాకు పిలుపు ఇంట్లో మామూలుగానే మాట్లాడేరు వే. మా గారి ఆఫీసులో ఆయన గదిలో అయింది అసలు ఇంటర్వ్యూ.

“చంపకమాలను ప్రేమిస్తున్నావా?”

—పేరు కరెక్ట్ చెయ్యడానికి ధైర్యం చాలలేదు తడబడుతూ మరో ప్రశ్న వేశాను “ఆమెతో నేనామాట అన లేదే?”

“భేష్ నా శిక్షణ ఫలవంతమైంది అంటే ఆమెతో జస్ట్ తిరుగుతున్నావన్న మాట ”


“అబద్ధం, డౌన్ రైట్ లై నేను, ఆమె ఒక్కరోజు బీచికి కలిసివెళ్ళడం తప్ప ఎప్పుడూ ఇద్దరం బయట కలవ లేదే?”

“గుడ్. నీకు హైదరాబాద్ ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ వస్తాయి చంపకమాలకు రెండేళ్ళవరకు శలవు దొరకదు. యూ కెన్ గో”

—తిరిగి వచ్చిన తరువాత అర్థమయింది, అసలు విషయం. ఏజెంట్ హెడ్ ఆఫీసులో వేమాగారికి, వేమా గారు మా నాన్నగారికి, మా నాన్నగారు వేమాగారికి శరపరంపరగా ఉత్తరాలు పంపుకున్నారని. కాని మాలకి ఏమని చెప్పను? ఆమెకు నా ట్రాన్స్ఫర్ సంగతి ఆఫీసులోనే తెలిసింది. బ్రతక నేర్చినవాడు అన్నారు నన్నందరూ.

* * *

“మే ఐ కమిన్ సర్!”



"కమిన్. సిట్ డౌన్ మాలా!"

—పరాకుగా ఆలోచిస్తూ అనేశాను. టైప్ చేసిన ఉత్తరాలు టేబిల్ మీద పెట్టింది స్టెనో చెదిరిన ముంగురులు, నుదుట చిరుచెమట రాస్తున్న కాగితాలు ఫైలులో పెట్టి సొరుగులో భద్రపరచి తల పైకెత్తాను. ఆశ్చర్యంగా చూస్తూంది స్టెనో.

"సారీ, అయామ్ గెటింగ్ ఓల్డ్."

—ఆమె తెచ్చిపెట్టిన ఉత్తరం ఒక్కొక్కటీ ఎగాదిగా చూసి సంతకం పెడుతున్నాను. జేబులోంచి ఓ నంబర్ తీసిచ్చి "ప్లీజ్. రింగ్ అప్ దిస్ నెంబర్ ఎండ్ ఆస్క్ ఫర్ మూర్తి" సంతకాలు బరబరా గీకేస్తున్నాను

"మూర్తి ఆన్ ది లైన్" ఫోన్ అందించింది స్టెనో.

"ఒరేయ్ మూర్తి యూ కెన్ గో . నాన్సెన్స్ నా పనులు చేయడానికా ఆమె ఇక్కడవుంది — అలా అయితే నేరుగా సాయంకాలం నాతోపాటే తీసుకెళ్ళమంటావా ఇంటికి ఆల్ మోస్ట్ రాసేశాను, రణచిత్తు, పికప్ చేస్తాను రెడీగావుండు."

—"నువ్వు పచ్చి మిసోజినిస్ట్ (స్త్రీ ద్వేషి)విరా!"

కాగితాలు నాకిచ్చేశాడు విసురుగా.

"కాదు. ఐలైక్ విమెన్. వాళ్ళు . వాళ్ళ తలల్లో పెట్టుకుంటూరే పూలచెండ్లు అలాంటివారు. ఏ స్త్రీ ఐనా ఒకేపూల చెండు రెండురాత్రులు ధరించటం చూశావా! అంతగా కాకపోయినా సాధ్యమైనంత తొందరగా మనం మార్చేస్తూండాలి. ఉయ్ హావ్ టు. మనం పిచ్చివాళ్ళం కాకుండా ఉండాలంటే...ఆశ్చర్యపోతావేం ఇదీ నా ప్రతీకారం ..మా నాన్న నేను లిటరేచర్ ఆనర్స్ చదివితే ఆ వే. మా. గారిని పట్టుకొని నాకు ఉద్యోగం వేయించి వారి మధ్యన స్నేహబంధాన్ని శాశ్వతంగా పదిలపరచుకోడానికి పద్మని నాకిచ్చి పెళ్ళిచేశారు. .బ్రతకనేర్చిన వాడివని నన్ను అన్నారు పదిమందీ .. కాంచనమాలకూడా అలాగే అనుకుని ఉంటుంది. కాని నేను ఆమెతోనే రోజూ కాపురం చేస్తున్నాను. సహస్ర భంగిమలలో నా కళ్ళముందు సాక్షాత్కరించినది ఆమే. నేను ఏకపత్నీ వ్రతుణ్ణి!" గదిలోకి వచ్చిన శ్రీమతిని చూసి ఆఖరివాక్యం గట్టిగా అన్నాను.

—"ఏకపత్నీవ్రతుణ్ణని చెప్పుకుంటున్నారా అతనితో మీ కథలు చదివే వాళ్ళందరికీ తెలిసిపోతుంది మీరు మరో స్త్రీవైపు చూడరని!"

ఆడవాళ్ళ ప్రాక్టికల్ మైండెడ్ నెస్ బొత్తిగా వచనకవితలా ఎబ్బెట్టుగా ఉంటుంది నిజం చెప్పుకోలేని సమరుణి. ధణ బ్రతకనేర్చినవాడిని. గ్రీష్మతాపంలో చెమట పట్టినా కొంత చల్లగా ఉంటుంది; కాని కన్నీరు, దాని విషాదం మనిషిని నిలువెల్లా దహించే కర్కోటకాగ్ని శిఖలు. మస్తిష్కంలో నిరంతరం మెదిలే మెరపు తీగను కాగితంమీద ప్రతిష్ఠించి మనసులో నింపుకున్నాను

—ఆర్పుతున్న స్విచ్ శబ్దంలో నా నిట్టూర్పు కలసిపోయింది. ★